నేడు లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఛాంబర్‌లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి సిఐటియు నాయకులను కలెక్టర్ ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్పందిస్తూ ఇది శ్రామిక మహిళలు సాధించిన తొలి విజయమన్నారు. శ్రామిక మహిళలు పని ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్యపై జిల్లాస్థాయిలో కమిటీని ఏర్పాటు చేయాలని, విభాగాల వారీగా అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని శ్రామిక మహిళా కమిటీ ఇటీవల నిర్వహించిన సదస్సు నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి స్పందించారు.

రాజకీయ నాయకుల 'అండ'
'కొండ'ంత 'కబ్జా'

యథేచ్ఛగా ఆర్సీపురంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు

ప్రభుత్వ భూములపై కన్నేయడం మామూలే.. ఇపుడు ఏకంగా 'కొండ'లపై ఎక్కుపెట్టారు కబ్జాదారులు.. వీరికి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. 'కొండ'ంతా మాదే అన్నట్లుగా ఉంది ఆక్రమణదారుల తీరు. రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయ్యింది.

ప్రజాశక్తి - రామచంద్రాపురం

మండలంలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జా అవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెమళగుంటపల్లి, బొప్పరాజు పల్లి, ఉప్పలివంక, రేకలచేను, నూతుగుంటపల్లి గ్రామాలలో వందలాది ఎకరాల కొండలు, కుంటలు, గుట్ట పోరంబోకు భూములను కొంతమంది కబ్జాదారులు యంత్రాలతో గత నెలరోజులుగా చదును చేసేస్తున్నారు. గుట్టలోని పెద్ద రాతి గుండ్లు, వక్షాలను, ముళ్ళపొదలను తొలగిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. తిరుపతి నగరానికి కూతవేటు దూరంలో ఈ మండలం ఉండడంతో భూముల విలువకారణంగా కబ్జాకు గురవుతున్నాయి. రెవెన్యూ అధికారులకు కబ్జాదారుల నుంచి భారీ ముడుపులు అందడం వల్లనే వందలాది ఎకరాలు ఆక్రమణకు గురవుతున్నా గుడ్లప్పగించి చూస్తున్నారే తప్ప, చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటలకు తహశీల్దార్ జిసి వెంకటేశ్వర్లు, ఆర్ఐ కృష్ణమ్మ, విఆర్ఓ సిద్ధయ్యలు ఆకస్మికంగా కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లోచదును చేస్తున్న యంత్రాల యజమానులు రెవెన్యూ అధికారుల రాకను తెలుసుకుని యంత్రాలతో పరుగులు తీశారు. తహశీల్దార్ జిసి వెంకటేశ్వర్లు స్పందిస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. జేసీబీలతో ప్రభుత్వ భూములను చదును చేయడానికి ఉపయోగిస్తే యంత్రాలను సీజ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని చదును చేసుకున్నంత మాత్రాన పట్టాలు ఇవ్వడం కుదరదన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కబ్జాదారులపై కేసులు పెడతాం : తహశీల్దార్

అనుపల్లి రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వానికి చెందిన కొండలు, గుట్ట, కుంట పోరంబోకు స్థలాలను ఆక్రమించుకొని, యంత్రాలతో చదును చేస్తున్న విషయం నా దష్టికి వచ్చింది. వెంటనే కబ్జాలకు గురి అవుతున్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించాను. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

వేమన పద్యాలకు పట్టాభిషేకం

మహాత్మాగాంధీ హైస్కూల్లో పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వేమన విజ్ఞాన కేంద్రం, బాలోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ హైస్కూల్లో 1-10వ తరగతి విద్యార్థులకు వేమన పద్యాలు, తాత్పర్యం అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు దామోదరం మీడియాతో మాట్లాడుతూ తెలుగు పదాలు, తెలుగు భాష అంతరిస్తున్న నేపథ్యంలో వేమన విజ్ఞాన కేంద్రం, బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేమన పద్యాలకు పట్టాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బైరాగిపట్టెడలోని హైస్కూల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం, బాలోత్సవ కమిటీ నాయకులు బండి మధుసూదన్‌రెడ్డి, ఒ.వెంకటరమణ, మునిరామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తూ...



టిటిడి కాంట్రాక్టు కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

కష్టజీవులంటే ఎనలేని గౌరవం : భూమన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కార్మికులంటే తనకు ఎనలేని గౌరవమని, వాళ్లకు సేవ చేయడానికి ఏ చిన్న అవకాశం దొరికినా వెనుకాడే ప్రసక్తే లేదని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. కార్మికులకు వేతనాలు పెరగడంలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి అండగా ఉన్నారన్నారు. కార్మికులకు మరింత మెరుగైన జీవితాన్ని ఇవ్వడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తానని చెప్పారు. టిటిడిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచిన నేపథ్యంలో గురువారం సిఐటియు జిల్లా నాయకులు కందారపు మురళి, వందవాసి నాగరాజు, సుబ్రమణ్యం నేతృత్వంలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ పై విధంగా స్పందించారు. తాను అనేక ఉద్యమాలు చేశానని, జైళ్లకూ వెళ్లానని, ఉద్యమాలు చేసినంత సులభంగా ఒక్కోసారి పనులు కావన్నారు.

కరుణాకర్‌రెడ్డికి 'సిఐటియు' అభినందనలు

టిటిడిలో సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, కార్మికులకు మంచి జరిగేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తానని చెప్పారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ గతంలో ఇస్తున్న విధంగా బ్రహ్మోత్సవ బహుమానం, లడ్డు, వడ కాంట్రాక్టు కార్మికులకు మంజూరు చేయాలని కోరారు. పెంచిన జీతాలను వచ్చే నెల నుంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే వేణుగోపాల్, కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కే. త్యాగ, ఎన్. రఘు, వి బాలాజీ, డీ పార్థసారధి, ఏకాంబరం, ప్రభాకర్, సిద్దు, శివారెడ్డి, గోపీనాథ్, ఉమాపతి, చిరంజీవి, శంకర్, బేబీ, చిత్ర, రుక్మిణమ్మ, ధనమ్మ, ఉష, అమ్ములు, సుభాషిని పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ బస్సు ప్రారంభం

ఆదరిస్తే మరో నాలుగు బస్సులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ బస్సును టిటిడి ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, అభినయ రెడ్డి లు గురువారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. ఎస్.పి.జే.ఎన్.ఎం. క్రీడా మైదానంలో ప్రారంభించారు. అక్కడ నుండి జ్యోతి థియేటర్ కూడలి, టౌన్ క్లబ్, ఎస్వీ యూనివర్సిటీ వరకు వెళ్లి అక్కడ నుండి టౌన్ క్లబ్ కూడలి మీదుగా అలిపిరి, కపిలతీర్థం కూడలి వరకు వెళ్ళి శ్రీనివాస సేతు మీదుగా మామిడి కాయల మండీ వరకు, అక్కడ నుండి తిరిగి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయం వరకు ఈ బస్ లో టిటిడి ఛైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు ప్రయాణించారు. అనంతరం గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ డబుల్ డెక్కర్ బస్ ను తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. తిరుపతి నగరం అన్ని విధాలుగా అభివద్ధి చెందుతున్నదని, కౌన్సిల్ ఆమోదంతో ఈ బస్ ను నగరపాలక సంస్థ కొనుగోలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి అందాలను వీక్షించేందుకు వీలుగా ఈ డబుల్ డెక్కర్ బస్ ను ఏర్పాటు చేశామని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ బస్‌ను నాలుగు మార్గాల్లో నడపనున్నామని అన్నారు. ఈ ఎలక్ట్రిక్ ఏ.సి. బస్ నిర్వహణను పరీక్షించిన తరువాత మరో నాలుగు బస్సులను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ బస్ లో ప్రయాణించడం కొత్త అనుభూతిని కలిగించిందన్నారు.

డబుల్ డెక్కర్ బస్సు ప్రారంభిస్తున్న టిటిడి ఛైర్మన్

తిరుపతి అభివృద్ధిలో టీటీడీ భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

విలేకరుల సమావేశంలో జి.వెంకటేశం

దశాబ్దాల కాలంగా తిరుపతిలో టీటీడీకి సంబంధించిన విద్యాసంస్థలు , హాస్పిటల్స్ ఇంకా ఎన్నో సంస్థలు ఏర్పడి టీటీడీ నిధులతోనే నేటికీ కొనసాగుతున్నాయని, నిత్యం శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సేవ కై తిరుపతి నగరం నిత్యం ఎదురుచూస్తోందని, అలాంటి తిరుపతికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను ఒక్క శాతం వెచ్చించడం ధర్మమని. తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్లు వెంకటేశం , వెంకటరమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్క్లబ్లో గురువారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ ఈనెల తొమ్మిదవ తేదీ టీటీడీ పాలకమండలి సమావేశంలో ఒక శాతం తి తి దే నిధులు తిరుపతి అభివద్ధి కోసం కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ ఉద్యోగులకు ఎంతోకాలంగా దశలవారీగా ఇస్తున్న ఇంటి స్థలాలు ఫ్రీగా ఇవ్వడం లేదని, తమ వేతనాలలో నెల నెల కట్ చేసుకోవడం ద్వారానే తమకు ఇంటి ప్లాట్లు వచ్చాయని, ఆనాటి గవర్నమెంట్ వాల్యూ ప్రకారమే తాము ఇంటి స్థలాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఉచితంగా తమకు టీటీడీ ఏమి ఇవ్వదని తెలియజేశారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తిరుపతి అభివద్ధి కోసం. ఒక్కసాతం నిధుల కేటాయింపును ప్రతి ఒక్కరూ. ఆహ్వానిస్తూ తిరుపతి అభివద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో టిటిడి ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు ప్రసాదరావు , భాస్కర్ , ఇందిరా కల్పన , రత్న ప్రభాకర్ , ఆదిలక్ష్మి , రామచంద్ర , రవికుమార్ , పద్మనాభం మునికష్ణ , గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం ప్రతి వాగ్దానాన్నీ నెరవేర్చారు : ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

చిన్నవాడైనా పెద్ద మనస్సుతో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ సిఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని, సంక్షేమానికి బాటలు వేస్తున్నారని పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. గురువారం వడమాలపేట మండలం పూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. మంత్రి రోజా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబాన్నీ సందర్శించి రెండు నుండి మూడువేల రూపాయలు విలువ చేసే వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తున్నారన్నారు. చిత్తూరు ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా అనేక సంక్షేమ పథకాలను మహిళలకు, పేదలకు అందిస్తున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ పరీక్షలు చేసుకుని మందులు పొందాలని, ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. పూడి గ్రామంలో 997 కుటుంబాలకు గాను 552 టోకెన్లను జారీ చేసి వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం కంటి అద్దాలను లబ్దిదారులకు స్వయంగా మంత్రి, ఎంపి, కలెక్టర్ అందించారు. ఈ క్యాంపులో డాక్టర్లు సుజిత, కిరణ్మయి, పావని, చక్రపాణి పాల్గొన్నారు. పుత్తూరు ఆరేటమ్మ కాలనీ పరిధిలో ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగింది.

ఓజిలిలో.. మాచవరం సచివాలయ ప్రాంగణంలో ఎంపిడిఒ వి.రజనీకాంత్, సర్పంచులు పిండుకూరు మౌనికరెడ్డి, గోపాలయ్య, శంకుసుజాత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీర్ఘకాలిక రోగాలు, ఇతర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు వైద్యులు డాక్టర్లు మోహన్‌రంగా, జాన్ డానియల్, రమేష్ వైద్యసేవలను అందించారు. తహశీల్దార్ ఎ.శివరామ సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి మస్తానయ్య, ఎఎంసి డైరెక్టర్ ప్రవీణ, వైసిపి నాయకులు పిండుకూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి టౌన్‌లో... కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా జగనన్న వైద్య శిబిరాల్లో వైద్యం అందిస్తున్నామని కమిషనర్ హరిత అన్నారు. 8, 43 వార్డులకు సంబంధించి జర్నలిస్టు కాలనీలోని సచివాలయం ఆవరణలో గురువారం వైద్యశిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రెటరీ రాధిక, ఆర్ఐ డి సూరిబాబు, సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు. **బిఎన్ కండ్రిగలో..** ఆర్.అనంతపురం గ్రామ సచివాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. డిఎంహెచ్ఒ బేబీరాణి, వైద్యాధికారి దివాకర్ పాల్గొన్నారు. వైద్యులు మానస, ఐశ్వరయ్య, రాజేష్‌లు 467 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి, ఎంపిడిఒ నరసింహారావు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కంటి అద్దాలు అమరుస్తూ...

ఆన్(ఫ్)లైన్ ...పరేషాన్..!

నిద్రావస్థలో పౌరసరఫరాల శాఖ
34.41శాతమే సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇంటింటా రేషన్ సరుకుల పంపిణి ప్రక్రియలో సాంకేతిక సమస్య తలెత్తింది. వారం రోజులు పాటు తిరుపతి జిల్లాలో రేషన్ సరుకులు పంపిణి సమస్యగా మారింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండియు నిర్వాహకులు ఏమి చేయలేక దక్కుతోచని పరిస్థితిలో వీధుల్లో బండ్లు పెట్టుకుని ఖాళీగా ఉంటున్నారు. ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా పౌరసరఫరాల శాఖ నిద్రావస్థలో ఉండి, వారం రోజుల తరువాత ఆఫ్‌లైన్‌లో లబ్ధిదారులు రేషన్ తీసుకోవాలంటూ ఆదేశాలిచ్చింది. ఏదిఏమైనా ఇప్పటివరకూ కేవలం 34.41శాతం మాత్రమే సరుకులు పంపిణీ కావడం గమనార్హం.

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 11.40లక్షలు బియ్యం కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు 4.03లక్షలమందికి పంపిణి చేశారు. మితగత 7.37లక్షలమందికి లబ్ధిదారులకు సరుకులు పంపిణి చేయాల్సి ఉంది. ఈనెల మొదటి తేది నుంచి సాంకేతిక సమస్య తలెత్తింది.సమస్య వచ్చినపుడు పౌరసరఫరాల అధికార్లు సమీక్షలు చేయకపోవడమూ ఒక కారణమని ఎండియు వాహనదారులు ఆరోపిస్తున్నారు. తిరుపతి జిల్లాలో 369 ఎండియు వాహనాలు ఉన్నాయి. 5,99,296 బియ్యం కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 34.41శాతం సరుకులు పంపిణి చేశారు. సరుకులు ఎపుడు ఇస్తారంటూ లబ్ధిదరులు పలుమార్లు అడుగుతున్నా

నిలిచిపోయిన వాహనాలు

ఎండియు నిర్వాహకులు సమాధానం చెప్పలేక అవస్థలు పడుతున్నారు. సాంకేతిక సమస్య తలెత్తినప్పటి నుంచి ఎండియు నిర్వాహకులు అధికారుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక సమస్య వచ్చినందు వల్ల ఈ సమస్య వచ్చిందని, తాము ఎమిచేయలేమని అధికార్లు చేతులెత్తేశారు. రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు పనులు మానుకుని ఇంటి వద్ద ఉండాల్సి వస్తోందని, ఇచ్చిన ఈ కొద్దిపాటి సరుకుల కోసం వచ్చిన కూలి డబ్బులు పోగొట్టుకోవాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి ఇంకెన్నాళ్లు సరుకుల కోసం ఎదురుచూడాలంటు కార్డుదారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎండియు నిర్వాహకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధుల్లో బండ్లు పెట్టుకుని కూర్చోవడమే తప్ప తమ గోడును పట్టించుకునే అధికారులే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఎండియులు జిల్లా పౌరసరఫరాల అధికారులను కలిసినప్పటికి ప్రయోజనం లేకపోవడంతో వీరంతా స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తమ గోడును విన్నవించుకున్నారు. ఇలా ఎన్ని రోజులు ఖాళీగా కూర్చోవాలంటూ ఎండియులు, పనులు మానుకుని, ఆదాయాన్ని వదులుకొని ఇంకెన్ని రోజులు ఈ రేషన్ బియ్యం కోసం ఎదురు చూడాలంటు లబ్ధిదారులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా సమస్య వచ్చినప్పుడు 20జిల్లాలకు ఆఫ్లైన్లోరేషన్ సరుకులు పంపిణీకి అనుమతి ఇచ్చారు. జిల్లా పౌరసరాఫరారల అధికారుల ఆలసత్వమో లేక రాష్ట్రపౌరసరఫరాలశాఖ నిర్లక్ష్యం వల్లో జిల్లాలో సరుకులు పంపిణి సక్రమంగా జరగడం లేదు. సాంకేతిక సమస్య పరిష్కరించి సరుకులు పంపిణి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

త్వరలో మరో 10 ఎలక్ట్రిక్ ఉచిత బస్సులు : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో శ్రీవారి భక్తులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేసే ఉచిత బస్సులలో (ధర్మరథాలు), భక్తుల సౌకర్యార్థం వారు దిగవలసిన ప్రాంతాలు, రాబోయే బస్ స్టాప్ లు తెలిసేలా ఎలక్ట్రానిక్ ఆటోమేటిక్ వాయిస్ అనౌన్స్ మెంట్ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో రవాణా విభాగం అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో 24 గంటల పాటు ఉచిత బస్సులు భక్తులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేస్తున్నాయన్నారు. అయితే ఈ బస్సులలో ప్రయాణించే భక్తులు తాము దిగవలసిన ప్రాంతాలు తెలియక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తాము దిగవలసిన ప్రాంతాల పేర్లను అనౌన్స్ మెంట్ల ద్వారా భక్తులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్‌టిసి సహకారంతో మరో 10 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, రవాణా విభాగాధిపతి శేషారెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్ రెడ్డి, ఈఈ సురేంద్ర, డిఈ (ఎలక్ట్రికల్) రవి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న ఈవో

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : ఆర్డీవో

ప్రజాశక్తి - గూడూరు టౌన్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఆర్డీవో కిరణ్‌కుమార్ ఉద్ఘాటించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని తిలక్‌నగర్‌లోని ఐటిఐ కళాశాలలో కాన్వొకేషన్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్‌కుమార్ డివిఇటిని, ఐటిఐలో నేషనల్ ఒకేషనల్‌లో ఉత్తీర్ణత సాధించి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చదువుకుంటే ఉన్నతస్థాయికి వెళ్లొచ్చని, చదువుతో జ్ఞానం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఎస్ ప్రసాద్‌రావు, వళని మురగన్ పాల్గొన్నారు.

శ్రీరామలో ఉచిత రక్తపరీక్షల శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్ లో గురువారం జాతీయ సేవ విభాగం, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ప్రేవియా హెల్త్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన, రక్తపరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాలకు చెందిన విద్యార్థులు, సిబ్బంది అన్నాస్వామిపల్లెకి చెందిన ప్రజలు పాల్గొన్నారు. లివర్, కిడ్నీ, థైరాయిడ్ వివిధ రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టినందుకు అధ్యక్షులకు, శ్రీరామ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందకుమార్ రెడ్డి, జాతీయ సేవ విభాగం ఆఫీసర్ ఎస్.చక్రధర్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్ : సిఐ

ప్రజాశక్తి -కోట

ప్రతి విద్యార్థిని విద్యాభ్యాసంలో నిర్లక్ష్య వైఖరిని విడనాడి, కష్టపడి చదివితే భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని కోట సబ్ ఇన్‌స్పెక్టర్ జి.పుల్లారావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పెల్లకూరు మండలం చావలి చెముడిపాలెం గ్రామానికి చెందిన నూలూరు చిరంజీవి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు నూలూరు కూటాలయ్య, లక్ష్మీ దేవమ్మ బుధవారం కోటలోని బాలసదనం బాలికల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినులకు విద్యా సామగ్రి, పుస్తకాలను కోట సబ్ ఇన్స్పెక్టర్ పుల్లారావు చేతుల మీదుగా అందించారు. బాలసదనం వార్డెన్ కే.దుర్గాదేవి, అకౌంటెంట్ కమిపాటి. అనురాధ, కొయ్యల మిల్లు పురిణి నాగయ్య పాల్గొన్నారు.

ఎంఎల్‌సి మేరిగ మురళీధర్‌కు ఘన స్వాగతం

గూడూరు టౌన్ : పార్టీని నమ్ముకుని అంకితభావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు గౌరవం కల్పించే మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. శాసనమండలి విప్‌గా ఎన్నికైన అనంతరం గూడూరుకు విచ్చేసిన ఆయనకు వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీ నిర్వహించి సంయుక్తనగర్‌లో సమావేశం నిర్వహించి, మేరిగ మురళీధర్‌ను సన్మానించారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మేరిగ మురళీధర్‌ను గూడూరు అభ్యర్థిగా ప్రకటిస్తే భారీ మెజార్టీ ఖాయమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వాలంటే మేరిగ మురళిని అభ్యర్థిగా ప్రకటిస్తే సాధ్యమన్నారు. ఈ మేరకు సిఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గాది విజయభాస్కర్, షేక్ మెయిన్‌బాషా, పేర్నేటి కిరణ్‌కుమార్, ఎవి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి : గాలి భానుప్రకాష్

పుత్తూరు టౌన్ : గెలుపే లక్ష్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలిభానుప్రకాష్ పిలుపునిచ్చారు. టిడిపి నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా కేవలం రాజకీయ కక్షతో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పేరుతో పది రూపాయలు ఇచ్చి, వంద రూపాయలు దోచుకుంటున్న తీరును ఎండగట్టాలన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గూడూరు రూరల్ : పట్టణంలోని ఓం శ్రీసాయిరాం చారిటీ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలు లక్ష్మమ్మ మృతిచెందగా నిర్వాహకురాలు కళ్యాణి సమాచారం ఇవ్వడంతో మౌత్రాడ్రస్ సేవా సమితి ఆధ్వర్యంలో సాంబశివరావు పేట సెంటర్లో ఉన్న స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. జనసేన జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ నేతృత్వంలో జరిగింది.

జశోవన్త కలశాయికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన రిసెర్చ్ స్కాలర్ జశోవన్త కలశాయికు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు పరీక్షల నియంత్రణ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విశ్వవిద్యాలయంలోని వేదాంత విభాగంలో ఆచార్యులు, దర్శన డీన్ ఆచార్య వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యుల మార్గదర్శకత్వంలో 'విష్ణు గరుడ నారదపురాణేషు ప్రోక్తానాం వైష్ణవాగమక్రియాణాంమనుశీలనమ్' విషయముపై ఆయన అధ్యయనం పూర్తి చేశారు.

ప్రజావైద్యుడు వాకాటి కృష్ణప్రసాద్‌కు సత్కారం

కోట : మండలంలోని సిద్దవరం గ్రామంలో శ్రీప్రసన్న ఆంజనేయస్వామి కార్తీకరొడిపై గ్రామానికి చెందిన ప్రజావైద్యుడు వాకాటి కృష్ణప్రసాద్‌కు సత్కారం జరిగింది. శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి, శ్రీ కల్యాణ రామాలయం ప్రధాన అర్చకస్వామి, ప్రజావైద్యులు, జ్యోతిష్య ప్రముఖ్ పురస్కారం గ్రహీతలు వాకాటి కృష్ణప్రసాద్ 42 సంవత్సరాలుగా గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. 119 దేవాలయాలను ప్రతిష్ట చేయించి, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జ్యోతిష్య ప్రముఖ్ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పౌరసన్మానాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. దంపతులు కృష్ణప్రసాద్, లక్ష్మీకుమారిలను పూలకిరీటాలు, గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు రామలింగారెడ్డి, దువ్వూరు రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు జిల్లా అర్చక నాయకులు ఈదూరు రామాచార్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై...

మరోసారి బషీర్‌బాగ్ ఉద్యమం : వామపక్షాలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి, తిరుపతి టౌన్

పెంచిన విద్యుత్ చార్జీలపై వైసిపి సర్కార్ వెనక్కు తగ్గకుంటే మరోసారి బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. పెంచిన విద్యుత్తు చార్జీలకు నిరసనగా స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో గురువారం వామపక్ష పార్టీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ బాధ్యుడు గంధం మణి, సిపిఐ జిల్లా కార్యదర్శి రామిరెడ్డి వెంకయ్య సంయుక్తంగా మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టాక సామాన్యులపై ధరాభారం అధికమైందన్నారు. ముఖ్యంగా కరెంటు చార్జీలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తున్నాడంటూ మండిపడ్డారు. గడిచిన ఈ నాలుగేళ్లలో 40 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్ కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. జగన్ సర్కార్ ట్రూ అప్ చార్జీలు, అదనపు చార్జీల పేరిట పూటకోసారి విద్యుత్ ఛార్జీలు పెంచి బిల్లు పెంచుతుందని షాక్ కొట్టేలా చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రానికి తలొగ్గి జగన్ ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలకు ఆజ్యం పోస్తున్నాడంటూ ధ్వజమెత్తారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ శుక్రవారం కరపత్రాల పంపిణీ, ఆదివారం స్థానిక పెండ్లి మండపం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మింధల శివకుమార్, సిపిఎం నాయకులు పెనగడం గురవయ్య, కుమార్, రాజా, పార్వార్డ్ బ్లాక్ పార్టీ నాయకులు తాతిలేటి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... ప్రజలకు భారంగా మారిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు పెను భారంగా మారిన విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం తగ్గించక పోతే బషీర్‌బాగ్ తరహాలో విద్యుత్ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజల పై భారం మోపే ట్రూ అప్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, కస్టమర్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షల ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలో శుక్రవారం జరిగే నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటరామిరెడ్డి, సి.ఐ. టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్, గోపినాథ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుట్టా శంకరయ్య, సిపిఐ నాయకులు ప్రభాకర్, శశి కుమార్, షేక్ కలేషా, చంద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్‌లో... పెంచిన కరెంట్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వద్ద కరపత్రాలను పంచిపెట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐఎంఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.వెంకటరత్నం పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

గూడూరులో...

పాఠశాల స్థలాన్ని కాపాడండి : సిపిఎం

శ్రీకాళహస్తి రూరల్ : ఎగువవీధి పంచాయతీ అరుంధతివాడలోని ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని సిపిఎం పట్టణ బాధ్యులు గంధం మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంధం మణి మాట్లాడుతూ సర్వేనంబర్ 44-5 గ్రామకంతం స్థలంలో 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసిందని, అయితే కాలక్రమేణా ఆ పాఠశాలలో వసతులు కొరవడడంతో పక్కనే ఉన్న హరిజనవాడ పాఠశాలకు మార్చారని తెలిపారు. ఇదే అదనుగా భావించిన కబ్జాదారులు పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారని, ఆక్రమణ కాకముందే సంబంధిత అధికారులు పాఠశాల స్థలానికి సంబంధించిన హద్దులతో కూడిన ధృవీకరణ పత్రాలు త్వరితగతిన వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, హరి, రాజా పాల్గొన్నారు.

స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా అనిత

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023-2024 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘ ప్రారంభోత్సవ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె మహదేవమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మహదేవమ్మ మాట్లాడుతూ 2023 - 24 విద్యా సంవత్సరంలో 1076 మంది విద్యార్థినులు డిగ్రీలో అడ్మిషన్ పొందారని, 700 మంది హాస్టల్ సీట్లు పొందారన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పరీక్షా ఫలితాల ఆధారంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కే.అనిత, బీఎస్సీ, స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారన్నారు. మార్కుల ఆధారంగా ఆఫీస్ బేరర్స్ ని ఎంపిక చేశామన్నారు. ఈఒ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, డీఈవో డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి సహాయ సహకారాలతో స్వయం ప్రతిపత్తి సాధనకు కషి చేస్తున్నామని తెలిపారు. టిటిడి డిఇఒ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో 34 విద్యాసంస్థలు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ మొదలైన వాళ్లందరికీ ప్రతిభా అవార్డులు ఇచ్చామన్నారు. మహాజాబ్‌మేళా నిర్వహించగా 190 మంది ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌ఛార్జి డాక్టర్ సి.భువనేశ్వరి దేవి, వార్డెన్ డాక్టర్ విద్యుల్లత, డాక్టర్ భద్రమణి పాల్గొన్నారు.

సంస్కారం నేర్పే దేవాలయం కళాశాల

సంస్కారం నేర్పే దేవాలయం కళాశాలని వక్తలు ఉద్ఘాటించారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమంలో జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహదేవమ్మ అధ్యక్షత వహించారు. టిటిడి డిఇఒ ఎం.భాస్కర్‌రెడ్డి, విజిలెన్స్ డిఎస్‌పి శివానంద కిషోర్, విశ్రాంత తెలుగు విభాగాధిపతి డాక్టర్ డిఎం ప్రేమావతి తదితరులు పాల్గొన్నారు

నవజీవన్‌లో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

క్యాంపస్ : తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ వృద్ధాశ్రమంలో శాలిని ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని గురువారం వృద్ధులకు వస్త్రాలను పంపిణీ చేశారు. శాలిని తల్లి నిర్మల రాయల్స్ ఆర్థిక సాయంతో ఈ వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఏర్పాటై 16 మాసాలే అయినప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకూ 42కు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. శాలిని సోదరులు సుధీర్‌బాబు, వెంకటేష్, పెద్దమ్మ మునిలక్ష్మి, సరోజమ్మ పాల్గొన్నారు.

కంటి చూపుపై అవగాహన పెంచుకోవాలి

నాయుడుపేట : ప్రపంచ దష్టి దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం పెసల జయరాజు గోపాల్ ఆధ్వర్యంలో నాయుడుపేట లోని బాలుర ఉన్నత పాఠశాల నందు కంటి చూపును మెరుగుపరుచు కొనేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాయుడుపేట ప్రముఖ కంటి వైద్య నిపుణులు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్. గోపినాథ్ కంటి గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమ సుధాకర్, రోటరీ క్లబ్ కార్యదర్శి ఎన్.రామమోహన్, హెచ్. సుబ్రమణ్యం, బి. సుబ్రమణ్యం, హరిబాబు, లక్ష్మీ నారాయణ, శంకర్ లాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2023 క్రికెట్ వరల్డ్ కప్ ఫేవరెట్ ఇండియానే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రస్తుతం మన దేశంలో జరుగుతున్న పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ 2023 ఫేవరెట్ ఇండియా నే అని థమ్స్ అప్, కోకో కోల కంపెనీ సీనియర్ కేటగిరి డైరెక్టర్ టిస్ కాండేనే తెలిపారు. టీమిండియాను మరింత ఎంకరేజ్ చేయడంలో భాగంగా ప్రముఖ హీరో షారుఖ్ ఖాన్ తో కలిసి థంప్సప్ కంపెనీ ఓ లఘు ఫిల్మును రూపొందించింది. ఆ లఘు ఫిలిం విడుదల సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ కప్ లో టీం ఇండియా ఫేవరెట్ గా బరిలో దిగడం సంతోషకరమన్నారు. వారిని మరింత ప్రోత్సహించేందుకు, థమ్సప్ ప్రియుల మద్దతును కూడగట్టేందుకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సుకేష్ నాయక్ పాల్గొన్నారు.

ఏపీజిబి సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ గురువారం పట్టణంలోని శివాలయం వీధిలో ఆర్థిక , సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజినల్ మేనేజర్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. బ్రాంచ్ మేనేజర్ దివ్య తేజ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భీమా పథకాలు , పొదుపు పథకాల పై అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంక్ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సాయి , షాలిమ , గురు స్వామి పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఏరియా ఆస్పత్రి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గూడూరు రూరల్

గూడూరు ఏరియా ఆస్పత్రిని జిల్లాస్థాయి ఆస్పత్రిగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్‌ఎ వరప్రసాదరావు అన్నారు. ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి సలహా కమిటీ సభ్యులతో గురువారం సమావేశం జరిగింది. ఎంఎల్‌ఎ ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పలు కట్టడాలు నిర్మాణంలో ఉన్నాయని, వీలైనంత త్వరలో వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు ప్రధాన ఆస్పత్రిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్లను గుర్తించి జాబితాలో చేర్చండి : మాజీ ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గూడూరు రూరల్

క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, పార్టీ అధ్యక్షులు ఇంటింటికి వెళ్లి వైసిపి అక్రమాలను తెలియజేస్తూ టిడిపిని బలోపేతం చేయాలని, ఓటర్లను గుర్తించి జాబితాలో చేర్చాలని మాజీ ఎంఎల్‌ఎ పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఇన్‌ఛార్జిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 17న నూతన ఓటరు లిస్టులు వస్తాయని, వాటిని తీసుకుని యూనిట్, క్లస్టర్, పార్టీ అధ్యక్షులు భారీగా ఓటర్లను వెరిఫై చేయాలని సూచించారు. జాబితాలో పేరు లేకుంటే గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిరణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రక్ష ప్రాథమిక హక్కులే..!

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

ప్రాథమిక హక్కులు ప్రజాస్వామ్యానికి రక్షక కవచం లాంటివని రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఏ. నాగేశ్వరరావు అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పుత్తూరు ఆర్ట్స్ విభాగం, ఎస్ వి యూనివర్శిటీలలోని న్యాయవిద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక హక్కులపై అవగాహనా సదస్సు జరిగింది. దేశ పౌరులకు కనీస హక్కులైన ప్రాథమిక హక్కులను రాజ్యాంగం కల్పించిందని, వీటికి రాజ్యాంగ రక్షణ ఉంటుందని అన్నారు. ప్రాథమిక హక్కులపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, డిగ్రీ కళాశాల అధ్యాపకులు సావిత్రి, వరలక్ష్మి పాల్గొన్నారు.

చట్టాల పటిష్టతతోనే బాలికల సాధికారిత

తిరుపతి టౌన్ : చట్టాల పటిష్టతతోనే బాలికల సాధికారత సాధ్యమని పి.అమర్‌నాథ్ అన్నారు. అన్నారావు సర్కిల్ దగ్గర శ్రీనివాసపురం ఎస్టీ కాలనీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పరివర్తన సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. బాలబాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని, కుటుంబంలోనూ, సమాజంలోనూ బాలికల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. ఈ కార్యక్రమంలో పి.కిరణ్, ఎం.వెంకటేష్, ఈ.మారమ్మ, జి.వెంకటమ్మ పాల్గొన్నారు.

స్విమ్స్‌కు హైడ్రాలిక్ స్ట్రెచ్చర్స్ విరాళం

తిరుపతి సిటీ : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) అసుపత్రికి హైదరాబాద్‌కు చెందిన దంజా హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు రూ. 5,72,300 విలువ గల ఐదు హైడ్రాలిక్ స్ట్రెచ్చర్ల ను విరాళంగా అందజేశారు. స్థానిక స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టిటిడి ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్విమ్స్ సిబ్బందికి ఫేస్ రికగ్నిషన్‌ను ప్రారంభించారు. టిటిడిలో అమలు పరుస్తున్న ఉద్యోగుల హాజరు విధానాన్ని స్విమ్స్ లోనూ అమలు పరచే విధంగా చర్యలు తీసుకొని, మొదటి విడతగా ఈ రోజు 19 పరికరాలతో ఫేస్ రెకగ్నిషన్ విధానాన్ని టి.టి.డి. ఈ.ఓ. ప్రారంభించారు. నవంబర్ నుండి ఈ విధానాన్ని పూర్తిగా అమలులోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రెండు కేసుల్లో 25 మంది స్మగ్లర్ల అరెస్ట్

21 దుంగల సహా లారీ, రెండు టూవీలర్లు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లో 21ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, 25మంది స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక లారీ, రెండు ద్విచక్ర వాహనాలు, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు ఆధ్వర్యంలో కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కపానందకు చెందిన ఆర్ఎస్ఐలు నరేష్, ఆలీబాషా టీమ్‌లు కర్నూలు జిల్లా వైపు కూంబింగ్ చేపట్టారు. చాగలమర్రి దగ్గర ఇరమడక వైపు వస్తున్న లారీని తనిఖీ చేయగా అందులో 20మంది స్మగ్లర్లు కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వీరు సిరసెల్ల రిజర్వు ఫారెస్టు నందు డంప్ చేసిన 11ఎర్రచందనం దుంగలను, లారీని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు ధర్మపురి జిల్లాకు చెందిన తెర్తగిరి పెరియస్వామి (42), పళని ఆండి (49), తిరువన్నామలై జిల్లా రాజేంద్రన్ చిన్నపయ్యన్ (60), కుమార్ మాణిక్యం (43), బాబు చిన్నవేలయ్యన్ (37), రమేష్ చిన్నస్వామి (38), రఘుపతి (23), అన్నామలై (29), ధర్మపురి జిల్లా చిన్నరాజి రామన్(33), చిన్నరాజిపూచితీర్ధన్ (33), తిరువన్నామలై జిల్లా ప్రకాష్ (20), హరికష్ణన్ (23), సెల్వరాజిరామన్ (45), తీర్థగిరి చిన్నతీర్థన్ (48), రాజమణి (37), రామన్ (24), లక్ష్మణన్ (24), సతీష్ కుమార్ (19), విశ్వనాథన్ (27), ధర్మపురి జిల్లా రవి (37), ఏపీ జిల్లా నంద్యాల టౌన్ జి. దాస్ (56), షేక్ అబ్దుల్ సత్తార్ (41)లుగా గుర్తించారు. మరో సంఘటనలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి టీమ్ రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ నుంచి రాజంపేట చిట్వేల్ రేంజ్ రెడ్డివారిపల్లి వైపు కూంబింగ్ చేపట్టారు. పెద్దకోన వంక వద్ద కొందరు వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లను పక్కన పెట్టి అనుమానాస్పదంగా కనిపించారు. వీరు టాస్క్ ఫోర్సు అధికారులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, వారిలో ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద 10ఎర్రచందనం దుంగలను, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని రైల్వే కోడూరు మండలానికి చెందిన కనపర్తి చంద్రశేఖర్ (31), కనపర్తి హరిబాబు (35), తిరుపతి కొర్లగుంటకు చెందిన దగ్గుపాటి ప్రవీణ్ కుమార్ (35)లను అరెస్టు చేశారు. ఈ రెండు కేసులను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రఫీ లు తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దుంగలు సుమారు టన్నుకు పైగా ఉండగా, రూ.60లక్షలు ఉండవచ్చునని అంచనా వేశారు. ఈ ఆపరేషన్లలో పాల్గొన్న టాస్క్ ఫోర్స్ సిబ్బందికి కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ రివార్డులను ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'చాంబర్‌ఆఫ్ కామర్స్' సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

చాంబర్‌ఆఫ్ కామర్స్ సమస్యలను పరిష్కరించాలని తిరుపతి అర్బన్ ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ అఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాయలసీమ జోన్ తిరుపతి జిల్లా చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు కె. వి. చౌదరి ఆధ్వర్యములో తిరుపతి జిల్లాలోని పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు తిరుపతి జిల్లా పోలీసు సూపరిండెంట్ ని కలిసి రెస్టారెంట్లు రాత్రి 12 గంటల వరకు ఇచ్చిన అనుమతి అమలు కొరకు, వ్యాపారస్తుల దుకాణాలవద్ద హిజ్రాల దసరా మామూళ్ల దౌర్జన్యము గురించి విన్నవించారు. జిల్లా ఎస్.పి స్పందిస్తూ తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సంస్కృత విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు

క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయలోని శ్రీపరమాచార్య శాస్త్రపరిరక్షణ కేంద్రం, కేరళ రాష్ట్రంలోని కాలడీ నగరంలో ఉన్న శ్రీశంకరాచార్య సంస్కత విశ్వవిద్యాలయంలోని శ్రీశంకరాచార్య అంతర్జాతీయ అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో వేదాంతం, వ్యాకరణం, మీమాంస, న్యాయ, సాహిత్య శాస్త్రాలలో ఉన్నటువంటి వివిధ అంశాలపై జాతీయ వాక్యార్థ సంగోష్ఠి ప్రారంభోత్సవం ఆచార్య రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం ఉదయం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేరళ రాష్ట్రంలోని కాలడీలో ఉన్న శ్రీశంకరాచార్య సంస్కత విశ్వవిద్యాలయంలోని శ్రీశంకరాచార్య అంతర్జాతీయ అధ్యయన కేంద్రం యొక్క డైరెక్టర్ ప్రొ.శ్రీకలా నాయర్ విచ్చేసి జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం యొక్క వైస్ చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తితో కలిసి జ్యోతిప్రజ్వలనం చేశారు.

జాన్ సుష్మకు అంతర్జాతీయ పరిశోధన ప్రాజెక్ట్

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జాన్ సుష్మ "ఎక్లిప్టా ప్రోస్ట్రాటా ఆధారిత మెగ్నీషియం ఆక్సైడ్ నానోపార్టికల్ యొక్క యాంటీ-డయాబెటిక్ యాక్టివిటీ, స్ట్రెప్టోజోటోసిన్-ప్రేరిత డయాబెటిక్ ఎలుకలపై వాటి పని తీరు" అనే అంశంపై అంతర్జాతీయ పరిశోధన ప్రాజెక్ట్‌ను పొందారు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచ స్థాయిలో మధుమేహం పరిశోధన, చికిత్స రంగాన్ని అభివద్ధి చేయడానికి తోడ్పడుతుంది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ లీడర్ డాక్టర్. మన్సూర్ ఇస్మాయిల్ షేక్, మలేషియా, ప్రొఫెసర్ జాన్ సుష్మా లను, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జ్యోత్స్న, అధ్యాపకులు ప్రొఫెసర్ ఆర్. ఉష, ప్రొఫెసర్ కిశోరీ అభినందించారు.

తిరుపతిలో కార్ కేర్ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ చికాగో ఆధారిత కార్ కేర్ కంపెనీ, శ్రీసాయి ఆటోస్పా భాగస్వామ్యంతో కో-బ్రాండెడ్ కార్-కేర్ స్టూడియోని తిరుపతిలో కార్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సాజన్ మురళి పురవంగ గురువారం ప్రారంభించారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని కొంక చెన్నయ్య గుంట ఏర్పాటుచేసిన షోరూం వద్ద ఆయన మాట్లాడుతూ అత్యాధునిక టర్టిల్ వాక్స్, డిటైలింగ్ టెక్నాలజీలు, అధిక అర్హత కలిగిన, శిక్షణ పొందిన సేవా సిబ్బందితో కూడిన టర్టిల్ వాక్స్, కార్ కేర్ స్టూడియో తిరుపతిలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ ప్రీమియం నాణ్యత గల కారు డిటైలింగ్ సేవలను అందించాలని లక్ష్యంగా శ్రీసాయి ఆటోస్పాతో భాగస్వామ్యం చేసుకున్నామని, దీని ద్వారా ఈ ప్రాంతంలో మంచి కార్ కేర్ సేవలు వినియోగదాలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్ల సంరక్షణలో గ్లోబల్ లీడర్‌తో భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE OF TIRUPATI
I.A. NO. 217 OF 2022
I.P.NO. 31 OF 2019

M. Ramakrishna Reddy .....Petitioner
Vs
V. Sujana devi and another .....Respondent.

NOTICE TO RESPONDENT NO.1

R - 1,
V. Sujana devi, W/o. Late Ravi,
D.No. 17 -143, Diguva(St) Oldpet,
Chandragiri Post and Mandal,
Tirupati District.
Madam,

Please take notice that the above I.P. No.31 OF 2019 in I.A. No. 217 OF 2022 filed by the petitioner against you and same is posted to 16-10-2023 for your notice. pelase be Present on the said date before the said court on 16- 10-2023 at 10.30 A.M either in person or through an Advocate and to raise your objections if any failing which the matter will be decided in your absence as exparte.
Hearing Date : 16-10-2023

Yaram Bhaskaraiah,
Advocate -Tirupati.
Cell No. 9440076914

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE OF CHITTOOR
GWOP NO. 259 OF 2023

BETWEEN: 1) Kandati Himabindu 2) Kandati Chenga Reddy 3) Kandati Ishitha Reddy, 1st and 2nd Petitioners are the natural guardians of Mother and father of their Minor daughter 3rd petitioner by name Kandati Ishitha Reddy ... Petitioners
And
NIL ... Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై కనిన పిటిషనర్లు 1) కందాటి హిమబిందు అత్తగారైన కందాటి భాగ్యవతి అనే భాగ్యవతమ్మ మరియు ఆమె భర్త కందాటి శ్రీనివాసులురెడ్డి వారి స్వయార్జితము తో 29.05.1989 మరియు 9. 12.2016వ సం॥రం నందు క్రింద కనిన స్థిరాస్తులను విక్రయపత్రము ద్వారా కొనియున్నారు. సదరు శ్రీనివాసులు రెడ్డి మరణానంతరము అతని భార్య భాగ్యవతి అనే భాగ్యవతమ్మ ఆమె మనుమరాలైన కందాటి ఇషిత రెడ్డి పేరుమీద ఈమె మైనరు అయినందున గార్డియన్ తల్లి కందాటి హిమబిందును నియమించి రిజిష్టర్ దాన సెటిల్ మెంట్ పత్రము తేది: 31.07.2019వ సం॥న వ్రాసి ఇచ్చినది. సదరు స్థిరాస్తులను (పిటిషన్ షెడ్యూలు ఆస్తులు) అమ్ముట కొరకు కోర్టు వారిని పాపకి గార్డియన్‌గా సదరు పిటిషనర్స్‌ను నియమించి కోర్టు నందు పిటిషన్ వేసియున్నారు. సదరు పిటిషన్ జిడబ్ల్యూఓపి నెం. 259/ 2023గా నమోదు కాబడి 31.10.2023వ తేది నాటికి వాయిదా వేసియున్నారు. కావున ఎవరైనా ఆక్షేపణదారులు వున్న యెడలవారు సదరు తేదికి సదరు కోర్టు నందు నేరుగా గాని లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు దాఖలు చేసుకొనవలయును. అట్లు లేని యెడల కేసు పరోక్షముగా తీర్మానించబడును.

వి.భార్గవి యాదవ్, అడ్వకేట్,
నెం.6-4-393, గాలి వీధి, తిరుపతి, సెల్: 92901 04511